www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 107 | | 4-10-2026 | | ఆదివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

# 22ఏ భూములకు నాలా ఊరట!

## నాలా రుసుము చెల్లింపుతో భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం

- శరవేగంగా ముఖ్యమంత్రి హామీల అమలు, ఉత్తర్వులు జారీ
- సమస్యల పరిష్కారంపై నిరంతరం మానిటరింగ్ చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన



.. వివరాలు 4లో

## సైబర్ ప్రపంచంలో చిన్నారుల రక్షణ మన బాధ్యత



- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహా
- 'నల్సా' ఆధ్వర్యంలో చిన్నారుల భద్రతపై జాతీయ సదస్సు

2



పిల్లల ఆన్‌లైన్ భద్రతను రక్షించేందుకు తెలంగాణ హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలతో చర్చించి సమగ్ర 'చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్‌ఏఎల్‌ఎస్‌ఏ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన దక్షిణ మండల ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సేఫ్టీ కవచం!

## చైల్డ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్

- సీఎం రేవంత్ రెడ్డి
- ఎన్ఏఎల్ఎస్ఏ దక్షిణ మండల ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభం
- ఉచిత న్యాయ సేవల కోసం సంచార లోక్ అదాలత్ వాహనాలు ప్రారంభం
- సైబర్ హెల్ప్‌లైన్ '1930', చైల్డ్ హెల్ప్‌లైన్ '1098' పై అవగాహన పెంచాలి

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** పిల్లల ఆన్‌లైన్ భద్రతను రక్షించేందుకు తెలంగాణ హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలతో చర్చించి సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్ ను సిద్ధం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా శనివారం ప్రారంభమైన దక్షిణ మండల ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో పేదలు, బలహీన వర్గాలకు న్యాయాన్ని ఒక ఆయుధంగా అందించేందుకు న్యాయ మిగతా 2లో

## గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి 2



## విద్య, వైద్యంపై సీఎం ఫోకస్ 2

సీఎంవో అధికారులతో సమీక్ష

పాఠశాలలు, హాస్పిటల్స్‌ను కలెక్టర్లు సందర్శించాలి



## ఉద్యమాలన్నింటికీ డిజిటల్ అడ్డా!

'సత్యాగ్రహ' వేదికను ప్రారంభించిన రాహుల్‌గాంధీ

దేశవ్యాప్తంగా సాగుతున్న పోరాటాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకొచ్చే ప్రయత్నం

.. వివరాలు 4లో



## దుబాయ్ ఘటన.. ఉగ్రవాద చర్యే!

కోపైలట్ ఉగ్రదాడికి యత్నించినట్లు యూఏఈ అటార్నీ జనరల్ వెల్లడి

క్రాష్ యాక్స్‌తో కెప్టెన్‌పై దాడి.. విమాన నియంత్రణను చేజిక్కించుకునే ప్రయత్నం

.. వివరాలు 4లో



## మౌంట్ తరంగ్-2 అధిరోహించిన గురుకుల విద్యార్థి

విద్యార్థిని అభినందించిన మంత్రి అడ్లూరి

.. వివరాలు 3లో



బ్యాలెట్‌తోఎన్నికల్లోకి వెళ్లేందుకు

# సిద్ధమా?

- కాంగ్రెస్ సీఎంలారా.. రాజీనామా చేసి రండి
- జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం?
- అనివార్య కారణాల వల్ల అమిత్‌షా టూర్ వాయిదా
- కేంద్ర మంత్రి బండి సంజయ్

కేంద్ర ఎన్నికల కమిషన్‌పై, ఈవీఎంలపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు.

.. వివరాలు 3లో

# అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు!

## అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా 2

ఐదుగురి దుర్మరణం.. 12 మందికి పైగా గాయాలు

మృతుల్లో ముగ్గురు మహిళలు.. పలువురికి తీవ్ర గాయాలు



వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ఘాట్‌రోడ్డులో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి పడిపోయిన ఘటనలో ఐదుగురు ప్రయాణికులు మృతి చెందగా, 12 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరొకరు మరణించారు.

- ఎన్నికల సంఘంపై పోరు ఎవరిది?
- కాంగ్రెస్-సీజేపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా వార్
- శివాజీ పార్క్ నిరసన తర్వాత మరింత ముదిరిన మాటల యుద్ధం
- 'ఏళ్లుగా పోరాడుతున్నది మేమే' అంటూ కాంగ్రెస్ శ్రేణుల ఎదురుదాడి

4

# 'వోట్ చోరీ' నుంచి.. 'క్రెడిట్ చోరీ' దాకా!



## రైస్ మిల్లర్లపై సర్కార్ ఉక్కుపాదం

సీఎంఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని పౌర సరఫరాల శాఖ హెచ్చరిక 3





## 10 నుండి 18 వరకు బతుకమ్మ వేడుకలు

ఏర్పాట్లపై సీఎస్ సంజయ జాజు 3

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
4 అక్టోబర్ 2026



# అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు..!

## అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా

## ఐదుగురి దుర్మరణం.. 12 మందికి పైగా గాయాలు

**వికారాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బయలుదేరిన వారి ప్రయాణం పెను విషాదంగా మారింది. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘోర ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, 12 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. పటాన్‌చెరు పరిధిలోని కేసారంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆయన అంత్యక్రియలను చింతకుంటలో నిర్వహించాల్సి ఉంది. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు సుమారు 50 మంది ప్రైవేటు బస్సులో బయలుదేరారు. అనంతగిరి హిల్స్ ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతున్న సమయంలో డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సులోని ప్రయాణికులు చెల్లాచెదురయ్యారు. ఒక్కసారిగా ప్రయాణికుల ఆర్తనాదాలతో ఘాట్ రోడ్డు ప్రాంతం భయానకంగా మారింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిని అంబులెన్సుల్లో సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందడంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో 12 మందికి పైగా గాయాలు కాగా, వారిలో పలువురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే కారణమా? లేక ఘాట్ రోడ్డులో మరేదైనా సమస్య తలెత్తిందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బస్సు బోల్తాపడిన ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును పోలీసు అధికారులు, ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

### సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

అనంతగిరి హిల్స్ ఘాట్ రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

### బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి: హరీశ్‌రావు

బస్సు ప్రమాదంపై బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించాలని, సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షతగాత్రులు, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులను కోరారు.

# గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

## అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం) :** గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. భూసేకరణ, పునరావాస ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన భూసేకరణ, పునరావాసంపై శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. సిద్దిపేట, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల భూసేకరణ వివరాలు, పెండింగ్ అంశాలపై పరిశీలించారు. గౌరవెల్లి నిర్వాసితుల పునరావాస సమస్యలపై సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులతో సమగ్ర చర్చ జరిపారు. భూసేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే సంబంధిత జిల్లాల కలెక్టర్లకు చేరాయని, భూసేకరణ, పునరావాస ప్రక్రియ వేగవంతానికి సత్వరం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీ నోటిఫికేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. ఎడమ, కుడి కాల్వల అంచనాలు, పంపిణీ ప్రతిపాదనలపై కూడా సమీక్షించారు. కాల్వల టెండర్ ప్రతిపాదనల స్థితిపై పరిశీలించారు. ప్రాజెక్టులో నీరు నిల్వ, విడుదల నివేదికలపై సమీక్షించారు. పర్యావరణ అనుమతులు, ఎన్‌జీటీ కేసుకు సంబంధించిన అంశాలపై, ఎంఎంఆర్ ప్యాకేజీ-3 ప్రతిపాదనలపై సమీక్షించారు. ఈ ప్రత్యేక సమీక్షలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, భూసేకరణ-పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్‌బాబు, ఈఎన్‌సి ఓ అండ్ ఎం మధుసూదన్ రావు, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, సంబంధిత జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సమగ్ర ‘చైల్డ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్’

మొదటి పేజీ తరువాయి

సేవా సంస్థలు పనిచేస్తున్నాయని కొనియాడారు. ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ న్యాయానికి దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సాంకేతిక పురోగతి సాధించినప్పటికీ అమాయకులైన పిల్లలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉందన్నారు. ఈ సదస్సుకు పిల్లల సైబర్ భద్రత అనే చాలా ముఖ్యమైన అంశాన్ని ఎంచుకున్నందుకు జస్టిస్ విక్రమ్ నాథ్ కి, ఎన్ఏఎల్ఎస్ఏకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజుల్లో పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. కానీ తమ పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు అనేది చాలామంది తల్లిదండ్రులకు తెలియడం లేదు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన జీవితాలను ఎంతో సులభం చేశాయి. ప్రపంచంలోని సమాచారం మన చేతిలోకి వచ్చింది. ఎక్కడున్న వారితోనైనా, ఎప్పుడైనా మాట్లాడగలుగుతున్నాం. కానీ పిల్లలు అమాయకులు. ఏది నిజం? ఏది అబద్ధం? ఏది మంచిది? ఏది ప్రమాదకరం? అన్నది వారు వెంటనే గుర్తించలేరు. తెలియక పిల్లలు చేసే చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చు. వాటి ప్రభావం పిల్లలపైనే కాదు.. వారి కుటుంబాలపై, సమాజంపై కూడా పడుతుంది. ఇంటర్నెట్ ఈ నేరాలను సృష్టించలేదు. కానీ నేరాలను ప్రపంచవ్యాప్తంగా చేయడం మరింత సులభం చేసింది. తల్లిదండ్రులకు ఏం జరుగుతుందో తెలియకపోవచ్చు. భయంతో పిల్లలు తమ సమస్యలను ఎవరికీ చెప్పలేకపోవచ్చు. అందుకే పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి? మన పిల్లలను ఎలా సురక్షితంగా ఉంచాలి? బాధిత పిల్లలకు న్యాయం ఎలా అందించాలి? మన ముందున్న ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మాట్లాడుతూ వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో అవగాహనతో గమనించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లల రక్షణకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేశంలోనే తొలి ‘చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు’ ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, షీ-భరోసా, సైబర్ ల్యాబ్‌లు, యాప్ ద్వారా ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. టీజీఎస్-ఎల్ఎస్ఏ, పాఠశాల విద్యాశాఖ ఒప్పందం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని, ఇప్పటికే 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే బాధితులు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను సంప్రదించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు. న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం. న్యాయం అంటే అతని గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. ముఖ్యంగా ఒక బిడ్డ కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం అని అన్నారు. న్యాయ సేవా సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.



### ‘సంచార లోక్ అదాలత్’ వాహనాల ప్రారంభం

ఉచిత న్యాయ సేవలను గ్రామీణ ప్రాంతాలకు, ప్రజల వద్దకే చేరవేసే లక్ష్యంతో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ‘సంచార లోక్ అదాలత్’ ప్రత్యేక వాహనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి.మోహన, జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ ఆర్. మహదేవన్, ప్రజాప్రతినిధులు, న్యాయ నిపుణులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యంపై సీఎం ఫోకస్

## సీఎంవో అధికారులతో సమీక్ష

### పాఠశాలలు, హాస్పిటల్స్‌ను కలెక్టర్లు సందర్శించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సీఎంవో అధికారులతో సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రధాన హాస్పిటల్స్ నిర్మాణాలు, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా హాస్పిటల్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వైద్యులు, ఇతర సిబ్బంది



అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలుపెట్టాలని, హాస్పిటల్స్ నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతోపాటు అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, హాస్పిటల్స్‌ను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైనచోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 22ఏ భూములకు ‘నాలా’ ఊరట!

## రుసుము చెల్లిస్తే అర్హమైన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం

## 22ఏ సమస్యల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** ఏళ్లుగా రిజిస్ట్రేషన్లకు నోచుకోక ఇబ్బందులు పడుతున్న కొన్ని 22ఏ పట్టా భూముల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. వ్యవసాయ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై, అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాని అర్హమైన పట్టా భూముల విషయంలో నాలా రుసుము, వర్తించే ఇతర ప్రభుత్వ రుసుములు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు మెమో నంబర్ 48062/యూఎల్‌సీ/ఏ1/2026 ద్వారా ఆదేశాలు ఇచ్చినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నాలా ప్రక్రియ పూర్తికాకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే కొనసాగుతూ, 22-ఏ జాబితాలో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. అయితే 22-ఏ జాబితాలో ఉన్న ప్రతి భూమికీ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ అవకాశం లభించదు. సంబంధిత దరఖాస్తులో రెవెన్యూ రికార్డులు, భూమిపై హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులు, ఇతర న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హత తేలిన తర్వాతే నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్లకు సూచించారు. అర్హులైన భూయజమానులు రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా పారదర్శకంగా, నిర్ణీత కాలపరిమితిలో దరఖాస్తులను పరిష్కరించాలని పొంగులేటి ఆదేశించారు. అమలు పురోగతిపై కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదికలు అందించాలని సూచించారు. ఏళ్లుగా సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, వాటిపై రుణాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హమైన సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు తాజా నిర్ణయం ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. 22-ఏ సమస్యల పరిష్కారానికి ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీ నేపథ్యంలో 22-ఏతో ముడిపడిన 10 నుంచి 12



రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయడంతోపాటు జీవో 118, జీవో 76లకు అనుగుణంగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, మున్సిపాలిటీలు తదితర చట్టబద్ధ సంస్థల అనుమతులు కలిగి 22-ఏ జాబితాలో ఉన్న అర్హమైన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఇప్పటికే మార్గం కల్పించింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టణ భూ గరిష్ఠ పరిమితి దరఖాస్తుల పరిష్కారానికీ ఇటీవల ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యను పరిష్కరించే దిశగా మరో నిర్ణయం తీసుకున్నట్లు పొంగులేటి వెల్లడించారు.

# సైబర్ ప్రపంచంలో చిన్నారుల రక్షణ మన బాధ్యత

## సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం) :** మానవాళికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి చిన్నారులేనని, సైబర్ ప్రపంచంలో వారిని లైంగిక దోపిడీ నుంచి కాపాడుకుంటూ సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ స్పష్టం చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సైబర్ స్పేస్‌లో చిన్నారులకు న్యాయం -- లైంగిక దోపిడీ నివారణ అనే అంశంపై ప్రతిష్టాత్మక సదస్సును శనివారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యమంత్రితోపాటు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మారుతున్న ఆధునిక జీవనశైలిలో ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులపై పని ఒత్తిడి పెరిగిపోయి పిల్లల కోసం తగినంత సమయం కేటాయించలేకపోతున్నారన్నారు. మరోవైపు మిగిలిన సమయాన్ని సైబర్ ప్రపంచం హరించేస్తోందని జస్టిస్ నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను సురక్షితంగా ఉంచడానికి అత్యంత చౌకైనది, కానీ నేడు దొరకకుండా చేజారిపోతున్న అత్యంత ముఖ్యమైన సాధనం పిల్లలతో గడిపే సమయం అన్నారు. నిర్మాణ ప్రదేశాల్లో పనిచేసే కూలీల పిల్లలు సైతం మొబైల్ ఫోన్లలో లీనమైపోతున్న పరిస్థితి నేడు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లల కోసం సమయాన్ని కేటాయించేలా గ్యారెంటీ ఇచ్చేందుకు వీలుగా వినూత్న చట్టాలు తీసుకురావాలిలన్నారు. ఇందుకు తెలంగాణ రాష్ట్రమే చొరవ తీసుకుని దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఒక చిన్నారికి అత్యుత్తమ భద్రత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే లభిస్తుందని చెప్పారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి



సహకారం లేకుండా ఏ చిన్నారీ ఉత్తమ పౌరుడిగా ఎదగలేడు.. కానీ మన పాఠశాలల్లో ముఖ్యంగా స్థానిక భాషా ఉపాధ్యాయులకు తగిన గౌరవం, మర్యాద దక్కడం లేదన్న భావన ఉంది.. ఈ దృక్పథం మారాలి అని అన్నారు. ఉపాధ్యాయులకు తగిన సమయం, భద్రత కల్పించినప్పుడే వారు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దగలరని చెప్పారు. మన దేశంలో జననాల (ఫెర్టిలిటీ) రేటు క్రమంగా పడిపోతోందని తెలిపారు. సౌకర్యవంతమైన భర్తీ నిష్పత్తి 2.1 నుంచి ప్రస్తుతం 1.97కి పడిపోయామని, ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు తరాల తర్వాత జపాన్ తరహాలో మన సమాజం కూడా వృద్ధుల సమాజంగా మారిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మనకున్న ఈ చిన్నారులు అనే ఆస్తిని బలోపేతం చేసుకోవాలని సూచించారు. చట్టాలు, సాంకేతికతను ఉపయోగించి వారికి పూర్తి భద్రత కల్పించాలన్నారు. కాగా, తన ప్రసంగం ప్రారంభంలో జస్టిస్ నరసింహ హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఇక్కడి వాతావరణంలోనే పెరిగానని, గాలిపటాలు ఎగరేస్తూ, సైకిల్ తొక్కుతూ, రాత్రి వరకూ ఆడుకుంటూ ఎంతో సురక్షితమైన వాతావరణంలో స్వేచ్ఛగా గడిపిన తన బాల్య జ్ఞాపకాలను సభికులతో పంచుకున్నారు. దేశ భవిష్యత్తును సురక్షితం చేయడమంటే పిల్లల భవిష్యత్తును సురక్షితం చేయడమేనని అరవిందుడి సూక్తిని ఈ సందర్భంగా ఉటంకించారు.

# బ్యాలెట్‌తో ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా?

- కాంగ్రెస్ సీఎంలారా.. రాజీనామా చేసి రండి
- జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం?
- అనివార్య కారణాల వల్ల అమిత్ షా టూర్ వాయిదా
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** కేంద్ర ఎన్నికల కమిషన్‌పై, ఈవీఎంలపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఈవీఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గెలిచింది కదా.. మరి ఆ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమా అని అడిగారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి శనివారం సాయంత్రం విచ్చేసిన కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ పార్టీ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, సంగప్ప, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆయన ఎన్డీయే మంత్రి కాదు.. సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అని చెప్పారు. అసలు ఇండి కూటమికి జనాదరణ లేదని, వాళ్ల ఆందోళన కార్యక్రమాలకు పట్టుమని పదిమంది కూడా రావడం లేదని, ముంబై, ఢిల్లీల్లో ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'సర' ప్రక్రియలో భాగంగా సీపీఎం దొంగ ఓట్లను తొలగించడంవల్లే కేరళలో అధికారంలోకి వచ్చామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారు కదా.. మరి దీనికి కాంగ్రెస్ నేతలు ఏమంటారు అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ రావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆయన పర్యటన వాయిదా పడిందని బండి సంజయ్ తెలిపారు. ప్రపంచమంతా కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను కొనియాడుతుంటే రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసిన వ్యక్తి సామాజికవర్గం ఓట్లు పోతాయోయేమోననే భయంతోనే వాళ్లు స్పందించడంలేదని, అలాంటి వాళ్లంతా తన దృష్టిలో దేశద్రోహులు, దిమాగీ నక్సల్సేనని అన్నారు.

### ఆలయంపై దాడి హేయనీయం

దిల్‌సుక్‌నగర్‌లో సంతోషిమాత ఆలయంపై దాడి హేయనీయమన్నారు.. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో దాడి చేసిన వాళ్లపై చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. దాడి చేసిన మతం వాళ్లు బాధపడతారనే కారణంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రజలు ప్రశ్నిస్తే దాడి చేసినోడిని పిచ్చోడిగా చిత్రీకరించడం అలవాటైందని విమర్శించారు. పిచ్చోడికి మందిర్, మసీదు అనే తేడా తెల్వదు.. కానీ మందిరాలపైనే ఎందుకు దాడి చేస్తున్నారు అని అడిగారు. హిందువులు దీటుగా స్పందించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం పద్ధతి మార్చుకుని దాడి చేసిన వాళ్లపై కఠినంగా వ్యవహరించాలని, లేకపోతే యువత రోడ్లపైకి వచ్చి తిరగబడితే వాళ్లను ఆపే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

### కాంగ్రెస్, బీఆరఎస్ దొందూ దొందే

బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ జరిపి చర్యలు తీసుకోదు.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ పోరాడదు అని మంత్రి బండి ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని సీబీఐకి ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాయలేదన్నారు. కేసీఆర్ కుటుంబానికి పూర్వమే చింతమడకలో వందల ఎకరాలున్నాయనడం పెద్ద జోక్ అంటూ ఆనాడు వాళ్లకు హైదరాబాద్‌లో అసలు ఇల్లే లేదు.. అధికారంలోకి వచ్చాకే ఇన్ని హోటళ్లు, ఆస్తులు ఎట్లా వచ్చాయి అని ప్రశ్నించారు. కాగా, టీచర్లు, గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగ యువత బీజేపీ పక్షానే ఉన్నారని, గతంలో రెండు ఎమ్మెల్సీ సీట్లను తాము కైవసం చేసుకోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల్లో బీజేపీకి సానుకూలత ఉందని, ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ బీజేపీ గెలుపు తథ్యం అని బండి సంజయ్ స్పష్టం చేశారు.



## మౌంట్ తరంగ్-2 అధిరోహించిన
# గురుకుల విద్యార్థి

### 6,027 మీటర్ల ఎత్తైన పర్వతం అధిరోహణ

### విద్యార్థిని అభినందించిన మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** సంకల్పం.. క్రమశిక్షణ.. పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని గిరిజన గురుకుల విద్యార్థి ఇస్లావత్ బన్నీ నిరూపించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,027 మీటర్ల (19,774 అడుగుల) ఎత్తైన మౌంట్ తరంగ్-2 అధిరోహించి చారిత్రక ఘనత సాధించాడు. గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ), కామారెడ్డిలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న బన్నీ గత నెల 22న ఆ పర్వతాన్ని అధిరోహించి 30న తిరిగి వచ్చాడు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బన్నీని శాలువాతో శనివారం సత్కరించి అభినందించి విద్యార్థి సాధించిన ఘనతను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బన్నీ సాధించిన విజయం తన ఒక్కడి విజయమే కాదు.. రాష్ట్రంలోని ప్రతి గురుకుల విద్యార్థికి స్ఫూర్తినిచ్చే ఘనత అన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాహస క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. లక్ష్యం ఎంత ఎత్తులో ఉన్నా దాన్ని చేరుకోవాలనే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే విజయాన్ని సాధించవచ్చని అన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగడమే నిజమైన క్రీడాస్ఫూర్తి అని, గెలుపు మాత్రమే కాదు.. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వాన్ని కూడా క్రీడలు, సాహస కార్యక్రమాలు పెంపొందిస్తాయని చెప్పారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది గురుకుల విద్యార్థులు క్రీడలు, సాహస రంగాల్లో ముందుకు రావాలని మంత్రి ఆకాంక్షించారు.

### తొలి భారతీయ బృందంలో భాగస్వామ్యం

మౌంట్ తరంగ్-2 సముద్రమట్టానికి 6,027 మీటర్ల ఎత్తులో ఉంది. అత్యంత క్లిష్టమైన పర్వతా రోహణలో పాల్గొన్న భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలిచాడు. సెప్టెంబరు 22న శిఖరాన్ని అధిరోహించి భారతీయ పర్వతారోహణ రంగంలో తనదైన ముద్ర వేశాడు. టీజీటీడబ్ల్యూఆరఈఐఎస్ కార్యదర్శి కె.సీతాలక్ష్మి బన్నీని అభినందిస్తూ మౌంట్ తరంగ్-2ను అధిరోహించిన తొలి భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలవడం గిరిజన గురుకుల సొసైటీకి గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సాహస ప్రతిభను వెలికితీసేందుకు సొసైటీ నుంచి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు. బన్నీ విజయంపై అధికారులు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సాహస స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కార్యదర్శి నటరాజ్, జాయింట్ సెక్రటరీ డి.ఎస్. వెంకన్న, డిప్యూటీ సెక్రటరీలు వేణుగోపాల్‌రావు, సూర్యప్రకాశ్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్ తదితరులు బన్నీని అభినందించారు.

# 10 నుండి 18 వరకు బతుకమ్మ వేడుకలు

- ఏర్పాట్లపై సీఎస్ సంజయ జాజు సమీక్ష



**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకత ఉన్న బతుకమ్మ పూల పండగను ఈనెల 10 నుండి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ట్యాంక్ బండ్‌పై వేలాదిమంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్‌పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాదిమంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాక పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుద్దీపాలతో అలంకరించాలని, నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుద్దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచఎండీఏ, జీహెచఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరుగనున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. బతుకమ్మ జరిగే పది రోజులపాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కూడా ఈ లోగోలో తెలియచేసేలా రూపొందించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణిప్రసాద్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, జీహెచఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మల్కాజిగిరి సీపీ బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టీకల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండలి కమిషనర్ అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ.నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లపై సర్కార్ ఉక్కుపాదం

### సీఎంఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని పౌర సరఫరాల శాఖ హెచ్చరిక

### ఏడు రోజుల్లో షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వాల్సిందే

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** ప్రభుత్వానికి ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలను చెల్లించకుండా తప్పించుకునే రైస్ మిల్లర్లపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. కనీస మద్దతు ధరతో ప్రజాధనంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. సీఎంఆర్ బకాయిలను రాబట్టేందుకు రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. బకాయిలున్న మిల్లర్ల నుంచి నిధుల రికవరీతో పాటు వారి ఆస్తులను వేగంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది. చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా, ఆస్తుల జప్తు ప్రక్రియలో సాంకేతిక లోపాలకు అవకాశం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా పౌర సరఫరాల శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో అక్టోబర్ 5 నుంచి ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది. మిల్లుల్లో అధికారులు నిర్వహించే ఆకస్మిక తనిఖీల్లో గోదాముల్లో ఉండాల్సిన పరిమాణం కంటే ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు తేలితే వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. నోటీసులు అందుకున్న మిల్లర్లు ఏడు రోజుల్లోగా తమ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వకపోయినా, ఇచ్చిన వివరణతో అధికారులు సంతృప్తి చెందకపోయినా తదుపరి చర్యలు తప్పవని శాఖ స్పష్టం చేసింది. అవసరమైతే ఆస్తుల జప్తుతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.



# 'గ్రేటర్' అభివృద్ధికి పక్కా ప్రణాళికలు అవసరం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** గ్రేటర్ హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి కేవలం నినాదాలతో సాధ్యం కాదని, పాలనా యంత్రాంగం పూర్తి సమన్వయంతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించి పనిచేసినప్పుడే సాధ్యమవుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా 'దిశా' కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మహానగరం విస్తరిస్తున్న కొద్దీ జిల్లాల సరిహద్దులు, కార్పొరేషన్లు వేరైనా నగరాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి తదితర జిల్లాల కలెక్టర్లు, జీహెచఎంసీ, సైబరాబాద్ పరిధిలోని ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు, కమిషనర్లు తరచూ సంయుక్తంగా సమీక్షలు నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సమకూరే మొత్తం ఆదాయంలో 70 నుండి 80 శాతం ఒక్క హైదరాబాద్ పరిసర జిల్లాల నుంచే వస్తోందని మంత్రి గుర్తు చేశారు. అలాంటి మహానగరంలో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించే జీహెచఎంసీ, వాటర్ బోర్డు వంటి సంస్థలు నిధుల కొరతతో సతమతం కావడం విచారకరమన్నారు. రొటీన్ బడ్జెట్ కేటాయింపులతో సరిపెట్టుకోకుండా నగర ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ పెంచుకునేందుకు అధికారులు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మెట్రో, మూసీ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులు ప్రభుత్వ ఆలోచనల ప్రకారం జరుగుతున్నప్పటికీ సామాన్య ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం, అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ లీకేజీల నియంత్రణ, మురుగునీరు-వర్షపునీరు వేరు చేసే శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో అలసత్వం వహించరాదన్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి మారాలని, పనులన్నీ సకాలంలో పూర్తి కావాలని సూచించారు. పేదల బస్తీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వ్యయంతో ఫ్లోరింగ్, టైల్స్, పెయింటింగ్, తాగునీటి వసతులు, పిల్లలకు దుప్పట్లు, యూనిఫాంలు వంటి సకల సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన అనుభవాన్ని ఆయన ప్రస్తావించారు. బస్తీల్లో ప్రాథమిక విద్య, వైద్యం, పారిశుధ్య వసతులను మెరుగుపరచడంలో అధికార యంత్రాంగం ఒక కుటుంబంలా బాధ్యతగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటికి సరిపోయేలా రాష్ట్ర అధికారులు సరైన డీపీఆర్‌లు, ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని స్పష్టం చేశారు. అధికారులు నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం నుంచి హైదరాబాద్‌కు, తెలంగాణకు నిధులు మంజూరు చేయించి తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## సంపాదకీయం



# జల సంక్షోభం దిశగా తెలంగాణ!?

### వానకాలం ముగిసినా నిండని జలాశయాలు..

### వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

**రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం లోటు.. 18 జిల్లాల్లో వానల కొరత**

**వానాకాలం వెళ్లిపోయింది.. కానీ తెలంగాణకు నీటి టెన్షన్ మొదలైంది. ఈసారి నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని పూర్తిగా కరుణించలేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 615.5 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే రాష్ట్రవ్యాప్తంగా 17 శాతం లోటు. సాంకేతికంగా ఈ లోటు 'సాధారణ' పరిధిలోనే ఉన్నప్పటికీ, జిల్లాలవారీగా చూస్తే పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. మొత్తం 33 జిల్లాల్లో 18 జిల్లాలు లోటు వర్షపాతంతోనే వానాకాలాన్ని ముగించాయి. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. పరిస్థితిని అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడంతోపాటు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయంతోపాటు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తాయని ప్రభుత్వం పేర్కొంది.**

#### జలాశయాల్లో 331 టీఎంసీల 'లోటు'

అసలు ఆందోళన రిజర్వాయర్ల దగ్గర మొదలవుతోంది. సెప్టెంబర్ 30 నాటికి తెలంగాణ పరిధిలోని కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో కలిపి 503.43 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఇదే రోజున 834.92 టీఎంసీలు ఉన్నాయి. అంటే ఏడాది వ్యవధిలోనే దాదాపు 331.5 టీఎంసీల మేర నిల్వలు తగ్గాయి. కృష్ణా పరిధిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. గతేడాది సెప్టెంబర్ 30న 583.35 టీఎంసీలున్న నిల్వలు ఈసారి 323.37 టీఎంసీలకు పడిపోయాయి. గోదావరి పరిధిలో 251.57 టీఎంసీల నుంచి 180.06 టీఎంసీలకు తగ్గాయి. కొత్తగా భారీ వరద ప్రవాహాలు రాకపోతే అందుబాటులో ఉన్న నీటిని వచ్చే వానాకాలం వరకు అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందని జలవనరుల వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

#### భూమిలోనూ నీటి 'అలారం'

పైపైన జలాశయాలే కాదు.. భూమి లోపల కూడా నీటి పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు గతేడాదితో పోలిస్తే భారీగా దిగజారాయి. హైదరాబాద్‌లో గతేడాది సెప్టెంబర్‌లో సగటున 3.57 మీటర్ల లోతులో నీరు అందుబాటులో ఉండగా ఈసారి అది 10.01 మీటర్లకు పడిపోయింది. మేడ్చల్-మల్కాజిగిరిలో 11.64 మీటర్లు, రంగారెడ్డిలో 11.74 మీటర్లు, సంగారెడ్డిలో 11.21 మీటర్లు, వికారాబాద్‌లో 11.96 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం చేరింది. రంగారెడ్డి జిల్లాలోనే పరిశీలించిన 84 బావుల సమాచారం ప్రకారం గతేడాది సెప్టెంబర్‌లో సగటు భూగర్భ జలమట్టం 6.31 మీటర్లుగా ఉండగా ఈసారి 11.74 మీటర్లకు దిగింది. 27 మండలాల్లో 26 మండలాల్లో గతేడాదితో పోలిస్తే నీటిమట్టం తగ్గినట్లు భూగర్భ జలవనరుల శాఖ నివేదిక వెల్లడించింది. చెరువు నిండితే బోరుకు ఊపిరి.. చెరువు ఎండితే పల్లెకు కష్టం. వానలు తగ్గడం, చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోవడం వల్ల భూగర్భ జలాల పునరుద్ధరణ కూడా దెబ్బతింటోంది. బోరు మరింత లోతుకు వెళ్తే రైతుకు విద్యుత్, మోటారు, నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. బోరు పూర్తిగా వట్టిపోతే పంటను కాపాడుకోవడమే ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పటివరకు ప్రధానంగా సాగునీటిపైనే కనిపిస్తున్న ఒత్తిడి రాబోయే నెలల్లో తాగునీటిపైనా పడే ప్రమాదం ఉందని జలవనరుల వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భూగర్భ జలాలు తిరిగి గణనీయంగా పుంజుకునేంత వర్షపాతం లేకపోతే అక్టోబర్ నుంచి వచ్చే వేసవి వరకు నీటి నిర్వహణ కీలకంగా మారనుంది.



# 'వోట్ చోరీ' నుంచి.. 'క్రెడిట్ చోరీ' దాకా!

- ఎన్నికల సంఘంపై పోరు ఎవరిది?..
- కాంగ్రెస్-సీజేపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా వార్
- శివాజీ పార్క్ నిరసన తర్వాత మరింత ముదిరిన మాటల యుద్ధం
- 'ట్విట్టర్‌కే పరిమితమైన లిబరల్ వ్యవస్థ' అంటూ అశుతోష్ రాంకా సెటైర్లు
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడే గుత్తాధిపత్యం ఎవరికీ లేదు' అంటూ సౌరవ్ దాస్ విమర్శ
- 'ఏళ్లుగా పోరాడుతున్నది మేమే' అంటూ కాంగ్రెస్ శ్రేణుల ఎదురుదాడి





**ముంబై, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై మొదలైన 'వోట్ చోరీ' రాజకీయ వివాదం ఇప్పుడు విపక్ష శిబిరంలోనే 'క్రెడిట్ చోరీ' రచ్చకు దారితీసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాకరోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమం నేపథ్యంలో.. ఈ అంశంపై అసలు పోరాటం చేస్తున్నదెవరన్న దానిపై సీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య సామాజిక మాధ్యమాల్లో మాటల యుద్ధం మొదలైంది. 'వోట్ చోరీ' అనేది ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాగా, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని తేల్చే స్వతంత్ర నిర్ధారణగా దాన్ని పరిగణించలేం. కాంగ్రెస్ కూడా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ కొంతకాలంగా ప్రచారం నిర్వహిస్తోంది. అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నేతృత్వంలో జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ భారీ నిరసన జరిగింది. ఈ ఆందోళన తర్వాతే విపక్ష వర్గాల మధ్య నాయకత్వం, ఉద్యమానికి దక్కుతున్న ప్రచారంపై విభేదాలు బహిర్గతమయ్యాయి. అంతకుముందే సీజేపీ దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునివ్వగా, కాంగ్రెస్ మాత్రం 'వోట్ చోరీ' ఆరోపణలపై విడిగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి.

#### 'లిబరల్స్ వ్యవస్థ యాక్టివేట్ అయింది'

దీప్కేకు లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక కొందరు 'స్వయం ప్రకటిత లిబరల్స్' ఆయనను లక్ష్యంగా చేసుకుంటున్నారని సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రాంకా విమర్శించారు. ఈ వర్గం సామాజిక మాధ్యమాలకే పరిమితమై ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యాన్ని తామే కాపాడుతున్నామన్న భావనతో వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. మరో సహ కన్వీనర్ సౌరవ్ దాస్ కూడా ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత తమదేనన్నట్లుగా ఓ వర్గం వ్యవహరిస్తోందని విమర్శించారు. అయితే వీరిద్దరూ తమ వ్యాఖ్యల్లో కాంగ్రెస్ పేరును నేరుగా ప్రస్తావించలేదు.

#### 'పోరాటానికి క్రెడిట్ కొట్టేస్తున్నారా?'

సీజేపీ నేతల వ్యాఖ్యలకు కాంగ్రెస్ వర్గాల నుంచి ఎదురుదాడి మొదలైంది. అసోంలో ఇటీవల అశుతోష్ రాంకా సహా సీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు కాంగ్రెస్ నేతలు సాయం చేశారని అసోం కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతమ్ సింగ్ పేర్కొన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేతలను మర్యాదపూర్వకంగా కలిసేందుకు కూడా సీజేపీ ప్రతినిధులు నిరాకరించారని ఆయన ఆరోపించారు. 'వోట్ చోరీ' ఆరోపణలను రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఇప్పటికే లేవనెత్తుతున్నాయని ఆ పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. రాహుల్‌గాంధీ సెప్టెంబర్‌లోనూ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా ఇటీవల ఎన్నికల జాబితాల సవరణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సీఈసీ రాజీనామా డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. దీంతో ఎన్నికల సంఘంపై విపక్షాల పోరు ఇప్పుడు మరో ఆసక్తికర రాజకీయ మలుపు తీసుకుంది. ఒకవైపు సీజేపీ వీధి ఉద్యమాన్ని ముందుకు తెస్తుండగా.. మరోవైపు ఈ అంశాన్ని తాము ముందుగానే లేవనెత్తామని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సంఘంపై మొదలైన 'వోట్ చోరీ' ఆరోపణల పోరు.. చివరకు విపక్షాల మధ్య 'క్రెడిట్ ఎవరిది?' అన్న సోషల్ మీడియా సమరంగా మారింది.. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా గాంధీ స్మృతిని దర్శించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముడు పోషించిన చా రిత్రాత్మక పాత్రను, ఆయన అందించిన సామాజిక సామ రస్య సందేశాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు. అంతకుముందు రాజ్‌ఘాట్‌లోని గాంధీజీ సమాధిని సం దర్శించి పూలమాలలతో నివాళులర్పించి, అక్కడ జరిగిన సర్వధర్మ ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం భారత మా జీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని విజయ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. 1964 నుంచి 1966 వరకు భారత ప్రధానిగా సేవలందించిన శాస్త్రి, 1965 ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశానికి అందించిన సమర్థవంతమైన నాయకత్వాన్ని, ఆయన ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని, పాటించిన ఉన్నత విలువలను ప్రధాని కొనియాడారు. 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల ద్వారా భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన తీరు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గాంధీజీ జయంతిని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, గాంధీజీ మరియు లాల్ బహదూర్ శాస్త్రుల దివ్య స్మృతికి దేశవ్యాప్తంగా నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.

# ఫ్లైదుబాయ్ ఘటన.. 'ఉగ్రవాద చర్యే'!

- కోపైలట్ ఉగ్రదాడికి యత్నించినట్లు యూఏఈ అటార్నీ జనరల్ వెల్లడి
- క్రాష్ యాక్స్‌తో కెప్టెన్‌పై దాడి.. విమాన నియంత్రణను చేజిక్కించుకునే ప్రయత్నం
- ఉద్దేశాలు, సంబంధాలపై ఇంకా కొనసాగుతున్న సమగ్ర దర్యాప్తు
- తీవ్రంగా గాయపడినా పెను ప్రమాదాన్ని తప్పించిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్ఛర్



**అబుదాబి, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జడ్--1073లో చోటుచేసుకున్న ఘటనపై కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. విమాన కోపైలట్ ఉగ్రవాద చర్యకు ప్రయత్నించినట్లు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో తేలిందని యూఏఈ అటార్నీ జనరల్ డాక్టర్ హమద్ సైఫ్ అల్ షమ్సీ అధికారికంగా వెల్లడించారు.

#### కాక్‌పిట్‌లో క్రాష్ యాక్స్‌తో దాడి

విమానం గాల్లో ఉండగానే కోపైలట్ తన ప్రణాళికను అమలు చేయడం ప్రారంభించినట్లు అల్ షమ్సీ తెలిపారు. కాక్‌పిట్‌లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే క్రాష్ యాక్స్‌తో కెప్టెన్‌పై దాడి చేసి, విమాన నియంత్రణ వ్యవస్థలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్ఛర్ పెను ప్రమాదాన్ని నివారించడంలో కీలకంగా వ్యవహరించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లించి సురక్షితంగా దించారు.

#### కుట్ర కోణంపై ఇంకా విచారణ

అయితే ఈ ఘటన వెనుక పూర్తి ఉద్దేశాలు, ఇతరులతో సంబంధాలు ఉన్నాయా, ముందస్తు ప్రణాళిక ఎంతవరకు ఉందన్న అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. భౌతిక, డిజిటల్ ఆధారాలతోపాటు సాంకేతిక అంశాలను అధికారులు విశ్లేషిస్తున్నారు. అన్ని దర్యాప్తు ప్రక్రియలు పూర్తయిన తర్వాత తుది ఫలితాలను ప్రకటిస్తామని యూఏఈ అటార్నీ జనరల్ స్పష్టం చేశారు.

# రక్షణ కవచాలు'గా మైనర్లు..

**సీజేపీ నిరసనలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు!**

ముంబై, అక్టోబర్ 03 (స్పంద న్యూస్): కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 02న ముంబై శివాజీ పార్క్‌లో నిర్వహించిన నిరసనల్లో మైనర్ పిల్లలను 'రక్షణ కవచాలు'గా ఉపయోగించారనే ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణ చేపట్టింది. సతీష్ వైద్ ఫిర్యాదుతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలను ఆధారంగా చేసుకుని కమిషన్ ఈ చర్యలు తీసుకుంది. పోలీసుల చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు మైనర్లను నిరసనల్లోకి తెచ్చారనే ఆరోపణలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా స్పందించింది. ముంబై పోలీస్ కమిషనర్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఎక్స్ కార్ప్, మహారాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ ఆధారాలను పరిశీలించి, నేరం రుజువైతే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ముంబై పోలీసులను ఆదేశించింది. జువైనల్ జస్టిస్ చట్టం ఉల్లంఘనపై దర్యాప్తు జరిపి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది.

# ఉద్యమాలన్నింటికీ ఒకే 'డిజిటల్ అడ్డా'!

- 'సత్యాగ్రహ' వేదికను ప్రారంభించిన రాహుల్‌గాంధీ
- దేశవ్యాప్తంగా సాగుతున్న పోరాటాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకొచ్చే ప్రయత్నం
- సమస్యను నమోదు చేస్తే.. అదే అంశంపై పోరాడుతున్న వారితో అనుసంధానం
- 'ఒంటరి గొంతు అణచివేతకు గురికావచ్చు.. కలిసిన గొంతుకలకు బలం'
- పార్లమెంట్ నుంచి వీధుల వరకు అండగా ఉంటానన్న విపక్ష నేత



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** దేశంలో వివిధ సమస్యలపై విడివిడిగా పోరాడుతున్న ప్రజలు, సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. 'సత్యాగ్రహ' పేరుతో రూపొందించిన డిజిటల్ వేదికను శనివారం ప్రారంభించారు. మహాత్మాగాంధీ జయంతి మరుసటి రోజే ఈ వేదికను అందుబాటులోకి తీసుకురావడం విశేషం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు సహా వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై సాగుతున్న ఉద్యమాల వివరాలను ఈ వేదికలో నమోదు చేసుకోవచ్చు. నమోదైన పోరాటాలను ఇంటరాక్టివ్ మ్యాప్‌లో చూపించడం ద్వారా ఒకే తరహా సమస్యపై దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో పోరాడుతున్న వారు ఒకరినొకరు గుర్తించేందుకు అవకాశం కల్పించాలన్నది దీని ఉద్దేశం.

#### 'ఒంటరిగా పోరాడాల్సిన అవసరం లేదు'

దేశంలో ఎంతోమంది తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పటికీ చాలాసార్లు వారు ఒంటరిగా మిగిలిపోతున్నారని రాహుల్ పేర్కొన్నారు. తమ సమస్య, ఉద్యమానికి సంబంధించిన వివరాలను ప్రజలు ఈ వేదికలో నమోదు చేయాలని కోరారు. అవసరమైన చోట పార్లమెంట్‌లో, వీధుల్లో, లేఖల ద్వారా తనకు సాధ్యమైన సహకారం అందిస్తానని చెప్పారు. ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలకు అండగా నిలవడం తన బాధ్యతగా పేర్కొన్నారు. వేదిక ప్రారంభమైన కొద్ది గంటల్లోనే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు నమోదు కావడం మొదలైంది. మధ్యాహ్నం నాటికి వేదికపై 421 నమోదులు కనిపించగా, విద్యకు సంబంధించిన సమస్యలు అత్యధికంగా ఉన్నట్లు అప్పటి డ్యాష్‌బోర్డ్ వివరాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొన్నాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాట స్ఫూర్తిని డిజిటల్ యుగానికి అనుసంధానిస్తూ ఈ వేదికకు 'సత్యాగ్రహ' అనే పేరు పెట్టారు. స్థానికంగా సాగుతున్న ఉద్యమాలను నమోదు చేయడం, ఒకే సమస్యపై పోరాడుతున్న వారిని పరస్పరం అనుసంధానించడం ఈ ప్రయత్నంలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

# ఈ నెల 5న ప్రజావాణి కార్యక్రమం రద్దు

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఈ నెల 5వ తేదీన నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నందున జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

# రోల్ మామడలో ఉచిత వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని రోల్ మామడ గ్రామంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్తులకు జ్వరాలు, దగ్గు, జలుబు, బీపీ, షుగర్, రక్తహీనత వంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ప్రత్యేకంగా పరీక్షలు చేసి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటిని కాచి వడబోసి తాగాలని అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ తొడసం శంకర్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పాఠశాలలో పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం గుడిహత్నూర్ మండలంలోని వైజాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక (ఎంపీపీఎస్) ప్రీ-ప్రైమరీ పాఠశాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన విధానం, మౌళిక వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చిన్నారులతో సరదాగా ముచ్చటించి వారి విద్యా నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నతనంలోనే పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేసి నాణ్యమైన విద్యాబోధన అందించాలని అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, డీఎంహెచ్ఓ సాధన, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# తుకారాం కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** ఇటీవల అకాల మరణం చెందిన కెరమెరి విలేకరి ఆత్రం తుకారాం కుటుంబానికి నమస్తే తెలంగాణ సంస్థ తరపున రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం బ్యూరో సిద్ధార్థ తుకారాం కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 14 సంవత్సరాల పాటు సంస్థలో సేవలందించిన తుకారాం అకాల మరణం చెందడం పట్ల సంస్థ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. తుకారాం కుటుంబానికి భవిష్యత్లోనూ సంస్థ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఆయన మరణాన్ని తలచుకుని కుంగిపోకుండా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ హన్మయ్య, జిల్లా ప్రతినిధి పెల్లి శంకర్, కామ్రే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు ఒక దిక్సూచి లాంటివారని, వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు, కుటుంబాన్ని నిలబెట్టిన తీరు నేటి తరం పాటించాలని తెలిపారు. వృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అని, వారి అనుభవాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధురాలు మహిళా సంఘాలలో సభ్యులుగా చేరితే ఎంతో భరోసా కలుగుతుందని, వ్యక్తిగత సమస్యలు గ్రూపు సభ్యులతో చర్చించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నం. 14567 కు కాల్ చేసి వివరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించిన రాజేశ్వరి, భూదేవి లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు డిపిఎం లు, ఎపిఎం లు, సెర్ప్ సిబ్బంది, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు





**ఉద్యమ కెరటం, నేరడిగొండ (ఇచ్చోడ):** బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలం మాన్కుగూడ గ్రామంలో శనివారం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో భారీగా చేరికలు జరిగాయి. టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గ్రామానికి చేరుకోగా స్థానికులు ఢోలు చప్పుళ్లు, పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమురంభీమ్ విగ్రహానికి రాథోడ్ బాపురావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్లో చేరారు. వారికి బాపురావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ మాన్కుగూడ గ్రామంలో నెలకొన్న తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన హయాంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పటేళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పేద ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ అన్నారు. శనివారం నేరడిగొండ మండలంలోని రాజుల్ తండాకు చెందిన బర్దవాల్ రేణుకకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.24వేల ఆర్థిక సహాయం చెక్కును ఆయన స్వయంగా లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందించడమే తమ లక్ష్యమన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారురాలి ఇంటికే స్వయంగా వచ్చి చెక్కు అందజేసిన ఆడే గజేందర్కు రేణుక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, సాబ్లే ప్రకాష్, బుక రాములు, సద్దాం, మురళి గౌడ్, పోతారెడ్డి, కుంట శంకర్, మౌలాన, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కాగజ్నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. బీటెక్, పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్హతలు కలిగిన 1,500 మందికి పైగా నిరుద్యోగ యువతీ, యువకులు మేళాకు హాజరయ్యారు. వివిధ కంపెనీల్లో ఎంపికైన 300 మందికి సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్బాబు ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంతో పాటు సమాచార, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జాబ్ మేళాలో 45 కంపెనీలకు చెందిన హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొని అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాబ్ మేళా నిర్వాహకులు చందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, కౌన్సిలర్ ఇర్ల విశ్వేశ్వరరావు, బీజేపీ నాయకులు చెప్పకుర్తి శ్రీనివాస్, శివగౌడ్, మనోహర్గౌడ్, కొప్పుల శంకర్, ఎలుముల మల్లయ్య, పుల్ల అశోక్, కుంచాల విజయ్, కుకుడే రాజేశ్వర్, మోతీరం, సర్పంచులు చెక్కాపురే లావణ్య, రాచర్ల మహేష్, అగిర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ మానేరు నీటిని విడుదల చేయాలి

- వరి నాటు వేసిన రైతుల ఆందోళన
- సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** నర్మాల ఎగువ మానేరు పరివాహక ప్రాంతంలోని రైతులు వరి నాట్లు వేసి, పంటలు నిండు పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో ఎగువ మానేరు జలాశయంలో నిండుకుండలా ఉన్న నీటిని వెంటనే దిగువకు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైతుల ఆందోళనపై అధికారులు తహశీల్దార్ మారుతి రెడ్డి, సీఐ వెంకటేష్, ఎస్సై శ్రీకాంత్ స్పందించి సాయంత్రం వరకు నీటి విడుదలపై నిర్ణయాన్ని ప్రకటిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ మాట్లాడుతూ ఎగువ మానేరు జలాశయంలో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ, వరి పంటలు నిండు పొట్ట దశలో ఉన్న సమయంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు వెంటనే నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేపటి వరకు ఎగువ మానేరు నీటిని విడుదల చేయకపోతే భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో తూములను బద్దలు కొట్టి నీటిని విడుదల చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సర్పంచ్ పొన్నాల మహేష్, ఉపాధ్యక్షులు యలేందర్, దుర్గేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, సర్వోత్తమ్, దేవేందర్ గౌడ్, తిరుపతి, రవీందర్ నాయక్, ఎల్లం రాజు, శ్రీనివాస్ గౌడ్, అనిల్, మల్లేష్ గౌడ్, రాజేష్, రవీందర్, రైతులు బత్తిని బాలయ్య, తొట్ల చిన్న మల్లయ్య, పెద్ద మల్లయ్య, నర్సింలు, సత్యం, శ్రీనివాస్, రాజనర్సు, దేవా గౌడ్, స్వామి, రాజశేఖర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీం 86వ వర్ధంతికి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు



**ఉద్యమ కెరటం, కెరమెరి:** ఆదివాసీ పోరాట యోధుడు, అమర వీరుడు కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 26న కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు. శనివారం జోడేఘాట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి వర్ధంతి ఏర్పాట్లపై వారు విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ ఈ నెల 26న జరిగే వర్ధంతి వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో గిరిజనులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, సందర్శకులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. హాజరయ్యే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. ప్రాంగణంలో నిరంతరం పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తూ అవసరమైన సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, స్పందన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, సైన్ బోర్డులు, సమాచార కేంద్రాలు, సహాయక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కొమురం భీం మనవడు సోనేరావు, గిరిజన సంఘాల నాయకులు తమ సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి కొమురం భీం వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్, పీఓ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, పలు శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ను తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స

రాష్ట్ర మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** క్యాన్సర్ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో షిర్డీ సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్పై అవగాహన కార్యక్రమం, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంటలో గంజాయి సాగు

51 మొక్కలు సీజ్, ఒకరి అరెస్ట్

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని ఆరేపల్లి గ్రామ శివారులో పత్తి పంట మధ్య గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారులు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో పోలీసు బృందం ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూమిలో తనిఖీలు నిర్వహించగా, పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతన్ని ఆరేపల్లికి చెందిన సిడాం గంగారాంగా గుర్తించారు. నిందితుడు తన పట్టా భూమిలో పత్తి మధ్య 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరిగిన 51 గంజాయి మొక్కలను రహస్యంగా సాగు చేస్తున్నట్లు తేలింది. వాటిని వేర్లతో సహా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో మొక్క విలువ రూ.10వేల చొప్పున మొత్తం రూ.5.10 లక్షల విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ గంజాయి సాగు, విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ వాట్సాప్ నంబర్ 8712659973 కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, గంజాయి సాగు చేసేవారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేస్తామని తెలిపారు.



# వన్యప్రాణి సంరక్షణే.. పర్యావరణ రక్షణ



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా బెజ్జూర్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులతో అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణులు, అటవీ పర్యావరణ ప్రాధాన్యతపై ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ శ్రవణ్కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు కేవలం చెట్లకు మాత్రమే కాకుండా లక్షలాది జీవరాశులకు నిలయాలని తెలిపారు. వన్యప్రాణులు అంతరించిపోతే ఆహార గొలుసు దెబ్బతిని పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు. పులులు, చిరుతలు అడవుల ఆరోగ్యానికి సూచికలుగా నిలుస్తాయని, పక్షులు పంటల్లో చీడపీడలను నియంత్రించడంతో పాటు విత్తన వ్యాప్తి ద్వారా అడవుల పునరుత్పత్తికి దోహదపడతాయని చెప్పారు. చెరువులు, చిత్తడి నేలలు వలస పక్షులకు ముఖ్యమైన ఆవాసాలని, వాటిని పరిరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వేటను అరికట్టడం, నీటి వనరులను పరిరక్షించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలి

- లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాధవ్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించడమే ఇందుకు కారణమని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఆన్లైన్ డేటా ఎంట్రీ, యాప్ నమోదు పనులతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. దీంతో తరగతి గదులు బోధన లేక మూగబోతున్నాయని, గ్రామీణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విద్యాశాఖ ప్రవేశపెట్టిన వార్షిక అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతులు సజావుగా సాగాలంటే ఉపాధ్యాయులు పూర్తి సమయాన్ని బోధనకే కేటాయించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి కేవలం బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టకపోతే, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు పెడితే కఠిన చర్యలు

సీఐ ఓదెల వెంకటేష్



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పంటలను అడవి జంతువుల నుంచి కాపాడుకునే పేరుతో విద్యుత్ తీగలు, నాటు బాంబులు, ప్రమాదకర గుంతలు వంటి పద్ధతులను ఉపయోగించవద్దని సీఐ ఓదెల వెంకటేష్ రైతులను హెచ్చరించారు. శనివారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అడవి జంతువులను వేటాడేందుకు పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడం, నాటు బాంబులు పెట్టడం, ప్రమాదకర గుంతలు తవ్వడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఇలాంటి పద్ధతులు వన్యప్రాణులతో పాటు పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, ప్రజల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పుగా మారుతాయని తెలిపారు. ఇటీవల పంట పొలం వద్ద అమర్చిన విద్యుత్ తీగల కారణంగా కౌలు రైతు దంపతులు మృతిచెందిన ఘటనను దృష్టిలో ఉంచుకుని ఈ హెచ్చరికలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి విద్యుత్ తీగలు, నాటు బాంబులు తదితర ప్రమాదకర పద్ధతులతో వన్యప్రాణులను వేటాడేందుకు ప్రయత్నిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు, వేటగాళ్లు చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పదంగా ఎవరైనా ప్రమాదకర పద్ధతులు ఉపయోగిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్
- లింగట్లలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని లింగట్ల గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం స్థానిక సర్పంచ్ మల్లేష్ పటేల్తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పాలన అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నూతన పంచాయతీ భవన నిర్మాణం త్వరగా పూర్తయితే గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. అనంతరం లింగట్ల గ్రామానికి చెందిన సాబ్లే దూరీభాయికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.27,500 ఆర్థిక సహాయం చెక్కును ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, మాజీ ఎంపీపీ సాబ్లే ప్రేమ్ సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాబ్లే కైలాష్, ఆత్మ డైరెక్టర్లు అందు సింగ్, కుంట శంకర్, కాంగ్రెస్ నాయకులు బుక రాములు, ఎండి సద్దాం, మురళీగౌడ్, పోతారెడ్డి, మౌలాన, ఇందల్ సింగ్, నూర్ సింగ్, ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలోని గాంధీ అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంగన్వాడీ మిలన్ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పూర్ణిమ, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి ఎక్కాల దేవి జమునచంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, శారీరక, మానసిక వికాసంలో పోషకాహారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, బాలల ఆరోగ్యం, విద్య, పోషణపై తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్వాడీ టీచర్ సృజన లహరి మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తించి తమను సన్మానించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడం, తల్లి



దండ్రులకు పోషణపై అవగాహన కల్పించడం వంటి సేవల్లో అంగన్వాడీ టీచర్లు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బందిని సన్మానించి వారి సేవలను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, బాలల



పోషణ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, జిల్లా ధార్మిక క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, కొక్క దేవేందర్, ఉపాధ్యక్షుడు ఏలంధర్, బీజేపీ నాయకులు రాజు, దేవరాజు, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కెరమెరి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక





- **అధ్యక్షుడిగా కేంద్రే చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎజాస్ అహ్మద్ ఏకగ్రీవ ఎన్నిక**

**ఉద్యమ కెరటం, కెరమెరి:** కెరమెరి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ నిరంతరం శ్రమిస్తుందని సభ్యులు ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కేంద్రే చంద్రకాంత్, ఉపాధ్యక్షుడిగా కూటికెల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఏజాజ్, కోశాధికారిగా వాడేకర్ పద్మాకర్, సంయుక్త కార్యదర్శిగా సంజీవ్, కార్యనిర్వహక కార్యదర్శిగా రాథోడ్ రమేష్, సలహాదారుగా గిత్తే కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కేంద్రే చంద్రకాంత్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, ఇళ్ల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. అలాగే మండలంలోని ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ, వాస్తవాలను ప్రజలకు అందించడంలో ప్రెస్ క్లబ్ ముందుంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి సంక్షేమానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు సీనియర్ జర్నలిస్టులు, స్థానిక ప్రముఖులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తామని నూతన బాధ్యులు తెలిపారు.

# వైజాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా గుడిహత్నూర్ మండలం వైజాపూర్ గ్రామంలో జై దేవి మెడికల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక సేవకుడు, జైదేవి మెడికల్ అధినేత గిత్తే మదన్ నేతృత్వంలో నిర్వహించిన శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఏఎస్పీ రిథ్విక్ సాయి కొట్టే, స్థానిక సర్పంచ్ మాడవి సీతాబాయి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని గిత్తే మదన్ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సింగరేణి ఏరియాలో స్వచ్ఛత కార్యక్రమం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి సింగరేణి ఏరియాలో స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమం 6.0కు శనివారం శ్రీకారం చుట్టారు. ఈనెల 3 నుంచి 31 వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా జీఎం కార్యాలయంతో పాటు జేవీఆర్ ఓపెన్కాస్ట్ ప్రాజెక్టు, కిష్టారం ఓపెన్కాస్ట్ ప్రాజెక్టు, జేవీఆర్ సీహెచ్పీ తదితర విభాగాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.వెంకటాచారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యాలయాలు, పనీ ప్రదేశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛతను ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బొల్లాం శ్రీనివాస్, జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు అధికారి ప్రహ్లాద్, కిష్టారం ఓసీ ప్రాజెక్టు అధికారి ఏఎల్ఎస్వీ సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ సోమశేఖర్, ఇతర అధికారులు, సూపర్వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

# ట్రాస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ జమీల్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** ట్రాస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా షేక్ జమీల్ ఎన్నికైన సందర్భంగా జైనూర్లో శనివారం అభినందన, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ అజ్జు లాలా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ జమీల్ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా షేక్ జమీల్ మరింత బాధ్యతతో పనిచేస్తూ ఉపాధ్యాయులు, విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జంగం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, మౌలానా దస్తగీర్ సాహెబ్, షఫీక్, తౌఫీక్, ఇక్బాల్, కిరణ్, మజర్, అజీమ్, సద్దాం, మజీద్, ఈసబ్ భాయ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక స్థైర్యం, స్త్రీ సాధికారతే 'బియాండ్ ది హొరైజన్' లక్ష్యం

- **కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా**
- **మహిళలు ఎందులోనూ తక్కువ కాదు: మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే 'బియాండ్ ది హొరైజన్ ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీయ ప్రచార యాత్ర ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, కష్టాలు, మానసిక కుంగుబాటును ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'బియాండ్ ది హొరైజన్ ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీయ ప్రచార యాత్రపై మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. యాత్ర ఉద్దేశాలు, ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమైన అంశమన్నారు. భవిష్యత్తు గురించి అతిగా ఆందోళన చెందకుండా, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ జీవితాన్ని సానుకూల దృక్పథంతో కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో బాల బాలికల మధ్య ఎలాంటి వివక్ష, అసమానతలు ఉండకూడదని అన్నారు. ప్రతిఒక్కరూ సమానమే అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా ఏదైనా విషయంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పుడు వారిని చులకనగా చూడకుండా ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులు, మిత్రులు, సమాజంపై ఉందన్నారు. ఎవరైనా మానసికంగా కుంగుబాటుకు గురైనట్లు అనిపిస్తే సమస్యను ఒంటరిగా ఎదుర్కోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులు, మిత్రులు, వైద్య నిపుణులతో మాట్లాడటం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించి, అవసరమైనప్పుడు సహాయం కోరేలా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.'బియాండ్ ది హొరైజన్' ప్రచార యాత్రలో భాగంగా ఆదిలాబాద్లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు మంచి స్పందన లభించిందని తెలిపారు. ముఖ్యంగా బాలికలు చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. మానసిక ఆరోగ్యంపై పట్టణ ప్రాంతాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోనూ విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కీలకపాత్ర పోషించాలని మీడియా ప్రతినిధులను కోరారు. మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ మాట్లాడుతూ తాను ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే పెద్దయ్యాక రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ నడపాలనే కల ఉండేదన్నారు. అయితే అనారోగ్య సమస్యల కారణంగా కొంతకాలం ఆ కలను నెరవేర్చుకోలేకపోయానని తెలిపారు. 2021లో బైక్ నడపడం నేర్చుకున్నానని, 2024లో సొంతంగా రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ కొనుగోలు చేసినట్లు వివరించారు. 2025లో తొలి ప్రచార యాత్రను నిర్వహించానని, ప్రస్తుతం రెండో 'బియాండ్ ది హొరైజన్ ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' ప్రచార యాత్రను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బైక్ యాత్ర ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళల సామర్థ్యంపై సమాజంలో ఉన్న మూస ధోరణులను మార్చాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మహిళలు ఏ విషయంలోనూ పురుషుల కంటే తక్కువ కాదని, వారికి అవకాశం కల్పిస్తే ఏ రంగంలోనైనా తమ ప్రతిభను చాటుకోగలరని అన్నారు. మహిళలు బైక్ నడపడం, సాహస యాత్రలు చేయడం వంటి అంశాలపై సమాజంలో ఉన్న సాంప్రదాయ అభిప్రాయాలు, మూస ధోరణులు మారాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తమ లక్ష్యాలను సాధించేందుకు వారిని ప్రోత్సహించడమే యాత్ర ఉద్దేశమని వివరించారు. అనంతరం మానసిక ఆరోగ్యంపై రూపొందించిన అవగాహన పోస్టర్ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. అంతకుముందు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన, మహిళా సాధికారత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రచార యాత్ర రైడర్లు పరాస్, అమిత్ త్యాగి, రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



# చిప్ రూపకల్పనపై విద్యార్థులకు సాంకేతిక శిక్షణ

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో చిప్ రూపకల్పన ప్రక్రియపై శనివారం ఆహ్వానిత తరగతులు నిర్వహించారు. ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈటీఈ), విజయవాడ సహకారంతో మూడో, నాలుగో సంవత్సరం ఈసీఈ విద్యార్థులకు శిక్షణ అందించారు. భీమవరంలోని విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఎం.సుమలత చిప్ రూపకల్పనలోని వివిధ దశలను విద్యార్థులకు వివరించారు. రిజిస్టర్ ట్రాన్స్ఫర్ లెవెల్ (ఆర్టీఎల్) నుంచి గ్రాఫిక్ డిజైన్ సిస్టమ్–2 (జీడీఎస్ఐఐ) వరకు జరిగే ప్రక్రియపై అవగాహన కల్పించారు. డిజిటల్ లాజిక్, ఫ్లిప్ఫ్లాప్లతో సర్క్యూట్ రూపకల్పన, వెరిలోగ్, సిస్టమ్ వెరిలోగ్ వంటి హార్డ్వేర్ వివరణ భాషల్లో కోడింగ్, ఆర్టీఎల్ కోడ్ను గేట్లు, ప్రామాణిక సెల్స్గా మార్చే సంశ్లేషణ తదితర అంశాలను వివరించారు. అలాగే ఫ్లోర్ప్లానింగ్, ప్లేస్మెంట్, క్లాక్ ట్రీ సంశ్లేషణ, రూటింగ్, భౌతిక ధ్రువీకరణ వంటి ప్రక్రియలను విద్యార్థులకు తెలియజేశారు. జీడీఎస్ఐఐ ఫైల్ ద్వారా చిప్ తుది భౌతిక రూపకల్పన సమాచారాన్ని సెమీకండక్టర్ తయారీ ప్రక్రియలో ఎలా ఉపయోగిస్తారో తెలిపారు. డిజిటల్ లాజిక్ నుంచి సిలికాన్ చిప్ తయారీ వరకు జరిగే పూర్తి ప్రక్రియపై విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్గా మాట్లాడుతూ ఇలాంటి ఆహ్వానిత తరగతుల ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన అధ్యాపకులను అభినందించారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ శిక్షణ విద్యార్థుల భవిష్యత్ కెరీర్కు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సరుకుల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా సరుకుల పంపిణీ, నిల్వలు, రికార్డుల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహశీల్దార్లు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్చార్జిలు, డిప్యూటీ ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో సరుకుల పంపిణీ, నిల్వలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్లకు అవసరమైన మేరకు సరుకులను సకాలంలో లిఫ్ట్ చేసుకోవాలని, లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. స్టాక్కు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రతినెలా నిల్వల వివరాలను పరిశీలించి సంబంధిత రికార్డులతో పూర్తిస్థాయిలో రీకన్సిలియేషన్ నిర్వహించాలని ఆదేశించారు. సరుకుల నిల్వలు, లిఫ్టింగ్, పంపిణీ తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సెస్ అధికారుల నిర్లక్ష్యం.. రైతుల ప్రాణాలతో చెలగాటం..!

- విద్యుత్ కోసం రైతుల సాహసం
- ట్రాన్స్ఫార్మర్ ఎక్కి లైన్లు బాగుచేసుకున్న రైతులు
- ఫోన్ చేసినా స్పందించని విద్యుత్ అధికారులు.. నర్మాలలో రైతుల ఆగ్రహం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండలంలోని నర్మాల గ్రామ పరిధిలో పంట పొలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయాన్ని రైతులు సంబంధిత సెస్ అధికారులకు, హెల్పర్, ఏఈ, డీఈలకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్పందించలేదని ఆరోపించారు. గంటలు గడుస్తున్నా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక కొంత మంది రైతులు స్వయంగా ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ లైన్లను పరిశీలించి, మరమ్మతులు చేపట్టిన దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రైతులు ట్రాన్స్ఫార్మర్పైకి ఎక్కి విద్యుత్ లైన్లను సరిచేసుకుంటున్న దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. "పంటలను కాపాడుకోవడానికి అధికారుల కోసం ఎంతసేపు ఎదురుచూడాలి..?" అంటూ రైతులు ప్రశ్నించారు. విద్యుత్ సమస్యపై సమాచారం అందించిన వెంటనే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు స్పందించకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్లో విద్యుత్ సరఫరా కీలకమని, చిన్నపాటి సాంకేతిక సమస్యల కారణంగా గంటల తరబడి సరఫరా నిలిచిపోతే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నర్మాల గ్రామ పంట పొలాల్లో విద్యుత్ సరఫరా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రైతుల ఫోన్ కాల్స్కు తక్షణమే స్పందించేలా సెస్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు నిపుణులైన సిబ్బందితోనే చేయాలని, రైతులు ప్రాణాలను పణంగా పెట్టి ట్రాన్స్ఫార్మర్లపైకి ఎక్కాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు తక్షణ స్పందన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు

- రీసర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. శనివారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్రావుతో కలిసి తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, పెండింగ్ దరఖాస్తులు, భూ రీసర్వే, భూభారతి దరఖాస్తులపై అధికారులతో చర్చించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను మండల, ఆర్డీఓ, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిల్లో పరిశీలించి, జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా పోర్టల్లో భూ సంబంధిత డాక్యుమెంట్ల అప్డేషన్ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 81 గ్రామాల్లో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను నిర్దేశిత ఎస్ఓపీ ప్రకారం చేపట్టాలని తెలిపారు. సర్వే రికార్డులు, మ్యాపులు, టీపన్లు, షెడ్యూల్, సమావేశాల మినిట్స్, ప్రొసీడింగ్స్ తదితర రికార్డులను సిద్ధంగా ఉంచాలన్నారు. రోవర్, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఆధారంగా శాస్త్రీయంగా సర్వే నిర్వహించాలని, ఫారం-9, ఫారం-10 నోటీసులు, సరిహద్దుల నిర్ధారణ తదితర ప్రక్రియలను నిబంధనల మేరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు రీసర్వేపై అవగాహన కల్పిస్తూ పహాణీలు, భూ యాజమాన్య పత్రాలు, ఈ-ల్యాండ్ డాక్యుమెంట్ల ఆధారంగా గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించాలని తెలిపారు. గుర్తించిన సమస్యలను తహశీల్దార్ స్థాయిలో పరిష్కరించాలని, క్లెయిమ్లు, అభ్యంతరాలు, అప్పీళ్లను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిష్కరించాలని అన్నారు. సాదాబైనామా పెండెన్సీ, 22-ఏ భూముల



సమస్యలు, భూ భారతి దరఖాస్తులపై మండలాల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ సరిహద్దు వివాదాలను మండలాల వారీగా గుర్తించి, కోర్టు కేసులు, పెండింగ్ అంశాలు, ప్రాధాన్యత కలిగిన కేసుల వివరాలను సిద్ధం చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ భూ వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా భవన నిర్మాణ అనుమతులు

**టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుమలత**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా కొనసాగుతోందని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుమలత తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులు, వాటి పరిశీలన, ఎయిర్పోర్ట్ జోన్ పరిధిలోని లేఅవుట్లపై తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన వివరాలను శనివారం వెల్లడించారు. ఏప్రిల్ నుంచి మున్సిపల్ పరిధిలోని రెసిడెన్షియల్ విభాగాల్లో 327 దరఖాస్తులు అందగా, నిబంధనలకు అనుగుణంగా ఉన్న 303 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వాణిజ్య సముదాయాల నిర్మాణానికి సంబంధించి 51 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉన్న 26 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ జోన్ ప్రభావిత ప్రాంతాల్లోని లేఅవుట్లు, భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికలను ఉన్నతాధికారులకు ఇప్పటికే పంపించినట్లు వివరించారు. నిబంధనల మేరకు కొన్ని అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ అనుమతులు పొందిన తర్వాతే భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

# ఎస్సీ వసతి గృహాలను పరిశీలించిన కలెక్టర్

**ఉద్యమ కెరటం,జగిత్యాల/ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మెట్పల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, సక్రమమైన పారిశుధ్య నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా వసతి గృహాల్లో అదనంగా నిర్మిస్తున్న వంటశాల, గదుల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పటివరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయో, మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేయవచ్చో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో పాటు, నిర్మాణంలో ఉన్న అదనపు సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి



తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీఓ నరసింహారావు, ఈఈ, పీఆర్ అధికారి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జై రాజ్, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లుపై భగ్గుమన్న గ్రామస్తులు

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్లు దుకాణం నిర్వాహకులు
- ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- గ్రామస్తుల ఆందోళనతో కల్లు దుకాణానికి తాళం

**ఉద్యమ కెరటం,దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి):** కల్తీ కల్లు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్లు దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామస్తులుశనివారం ఆందోళనకు దిగారు. కల్లులో విచ్చలవిడిగా మత్తు పదార్థాలు కలిపి విక్రయిస్తున్నారని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. కల్తీ కల్లు కారణంగా గ్రామస్తులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ అధికారులు నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు.

**కల్తీ కల్లుతో భారీగా ఆదాయం**

కల్లు దుకాణం నిర్వాహకులు అధిక మత్తు కలిగించే పదార్థాలను కలిపి ప్రజలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వ్యాపారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించకుండా మామూళ్ల మత్తులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. కల్తీ కల్లు విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, స్వచ్ఛమైన కల్లు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

**గ్రామస్తుల ఆందోళన.. దుకాణానికి తాళం..**

అల్వాల గ్రామస్తులు కల్లు దుకాణం ఎదుట ఆందోళన చేపట్టడంతో పరిస్థితిని గమనించిన దుకాణం నిర్వాహకులు దుకాణానికి తాళం వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. కల్తీ కల్లు విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సంబంధిత దుకాణంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# అడవి పంది దాడిలో రైతుకు తీవ్ర గాయాలు



**ఉద్యమ కెరటం, కౌటాల:** మండలంలోని మొగడదగడ్ గ్రామానికి చెందిన రైతు హుల్కె షాజన్ శనివారం ఉదయం తన పంట పొలానికి వెళ్తుండగా అడవి పంది అడ్డంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రైతు కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కాగజ్నగర్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్కు తరలించారు. అటవీ అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని రైతు కోరారు.

# శేఖాపూర్లో తొమ్మిది ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు

- రెండో విడతలో లబ్ధిదారుల ఇళ్ల వద్ద మార్కింగ్, జీపీఎస్ ఫొటోలు



**ఉద్యమ కెరటం, మద్నూర్:** మండలంలోని శేఖాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి అధికారులు శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. కామారెడ్డి జిల్లా హౌసింగ్ డీఈ గోపాల్ ఆధ్వర్యంలో అధికారులు అర్హులైన లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సంగీత, ఉప సర్పంచ్ ఫాక్రు పటేల్ మాట్లాడుతూ రెండో విడతలో భాగంగా శేఖాపూర్ గ్రామానికి తొమ్మిది ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల వద్ద మార్కింగ్ వేసి, జీపీఎస్ ఫొటోలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. నిధులను డీబీటీ ద్వారా విడతల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని వివరించారు. సర్వే పూర్తయిన అనంతరం లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చిన్నారులకు యూనిఫాంల పంపిణీ



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు శనివారం యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ఎం.కిశోర్, అంగన్వాడీ టీచర్ చక్రవర్తి పాల్గొని చిన్నారులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. యూనిఫాంలు అందడంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి మరో ముందడుగు

- శానిటేషన్, సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధిపై సిఎంసీ కమిషనర్ కు వినతి



**ఉద్యమ కెరటం, కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** సాయిబాబా నగర్ డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి మరో ముందడుగు పడింది. డివిజన్ పరిధిలోని పారిశుద్ధ్య సమస్యలు, సీసీ రోడ్ల అభివృద్ధి, సిఎంసీ పార్కుల నిర్వహణ తదితర అంశాలపై మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు కలిసి సిఎంసీ కమిషనర్ సృజనను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్కు వివరించి, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే సిఎంసీ పరిధిలోని పార్కుల నిర్వహణను మెరుగుపరచి, వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా, సాయిబాబా నగర్ డివిజన్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# గోల్ఫ్‌లో ప్రణవికి స్వర్ణం..

## చరిత్ర సృష్టించిన భారత క్రీడాకారిణి

**నాగోయా, అక్టోబరు 3:** ఆసియా క్రీడల్లో భారత యువ గోల్ఫర్ ప్రణవి ఉర్స్ చారిత్రక ప్రదర్శనతో మెరిసింది. మహిళల వ్యక్తిగత స్ట్రోక్ ప్లే విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించింది. తద్వారా ఆసియా క్రీడల్లో మహిళల వ్యక్తిగత గోల్ఫ్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ప్రణవి ప్రదర్శనతో పాటు మహిళల జట్టు విభాగంలోనూ భారత్‌కు రజత పతకం దక్కింది. కసుగై కంట్రీ క్లబ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రణవి మొత్తం 15-అండర్ 265 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. చివరి రోజు మూడు స్ట్రోకుల ఆధిక్యంతో బరిలోకి దిగిన ఆమెకు మూడో హోల్‌లో ట్రిపుల్ బోగీ ఎదురైంది. దీంతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే ప్రణవి ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా పుంజుకుంది. 6, 10, 13వ హోల్స్‌లో కీలక బర్డీలు సాధించి మళ్లీ ఆధిక్యంలోకి వచ్చింది. చివరి వరకు అదే జోరును కొనసాగిస్తూ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. చైనాకు చెందిన యిన్ రునింగ్, సింగపూర్‌కు చెందిన షానన్ టాన్ సంయుక్తంగా రజత పతకాలు సాధించారు. వ్యక్తిగత విభాగంలో ప్రణవితో పాటు పోటీపడిన అదితి అశోక్ 14వ స్థానంలో, దీక్షా దాగర్ 23వ స్థానంలో నిలిచారు. జట్టు విభాగంలో ప్రణవి కీలక ప్రదర్శన చేయడంతో భారత మహిళల జట్టు 14-అండర్ 546 స్కోరుతో రజత పతకాన్ని సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో మహిళల గోల్ఫ్ జట్టు విభాగంలో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం, జట్టు విభాగంలో రజతంతో ప్రణవి ఉర్స్ ఆసియా క్రీడల్లో భారత గోల్ఫ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.

# పాక్‌పై తిలక్ వర్మ మెరుపులు.

## అరుదైన రికార్డు

**నాగోయా, అక్టోబరు 3 :** ఆసియా క్రీడలు 2026 పురుషుల క్రికెట్ ఫైనల్లో టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన తుది పోరులో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్.. కేవలం 22 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. తిలక్ దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ 20 ఓవర్లలో 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాకిస్థాన్‌పై అంతర్జాతీయ టీ20 ఫైనల్స్‌లో రెండుసార్లు 50కిపైగా పరుగులు సాధించిన తొలి ఆటగాడిగా తిలక్ వర్మ రికార్డు సృష్టించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది ఆసియా కప్ ఫైనల్లోనూ పాక్‌పై అజేయంగా 69 పరుగులు చేసిన తిలక్.. ఇప్పుడు ఆసియా క్రీడల ఫైనల్లో మరోసారి అర్ధశతకంతో మెరిశాడు. దీంతో పాకిస్థాన్‌పై కీలక మ్యాచ్‌ల్లో తన స్థాయిని మరోసారి చాటుకున్నాడు. టీ20 ఫైనల్స్‌లో రెండుసార్లు 50కిపైగా పరుగులు చేసిన భారత బ్యాటర్ల ప్రత్యేక జాబితాలోనూ తిలక్ వర్మ చోటు సంపాదించాడు. అంతకుముందు విరాట్ కోహ్లీ 2014, 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఈ ఘనత సాధించాడు. దీంతో కోహ్లీతో కలిసి తిలక్ ఈ ప్రత్యేక జాబితాలో నిలిచాడు. భారత్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా తిలక్ వర్మ, శివమ్ దూబే కలిసి ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దూబే 15 బంతుల్లో 27 పరుగులు చేయగా.. తిలక్ చివరి వరకు క్రీజులో నిలిచి వేగంగా పరుగులు సాధించాడు. వీరిద్దరి దూకుడుతో భారత్ 200 పరుగుల మార్కును దాటి 211 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్‌ను 192 పరుగులకే పరిమితం చేసి భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించారు.



# మాస్టర్‌జీ.. అంబాజీ!

## డీడీ హోదా పక్కనపెట్టి.. బోర్డు పట్టిన జాదవ్ అంబాజీ



**పట్నాపూర్ గిరిజన సంక్షేమ పాఠశాలలో మాస్టారుగా మారిన అధికారి**

- పిల్లలకు పాఠాలు.. మధ్య మధ్యలో ప్రశ్నలు.. సమాధానాలకు ప్రశంసలు
- అభ్యసన స్థాయిలను స్వయంగా పరిశీలించిన గిరిజన సంక్షేమ శాఖ డీడీ
- ఉన్నతాధికారి పాఠాలు చెప్పడంతో విద్యార్థుల్లో ఉత్సాహం

**హోదా డిప్యూటీ డైరెక్టర్.. చేతిలో మాత్రం బోర్డు.. ఎదురుగా చిన్నారులు.. కాసేపటికే ఆయన అధికారి కాదు.. అచ్చంగా మాస్టారైపోయారు. పాఠం చెప్పారు.. ప్రశ్నలు అడిగారు.. పిల్లల నుంచి సమాధానాలు రాబట్టారు. సరైన జవాబులు చెప్పిన వారిని మెచ్చుకున్నారు. దీంతో తరగతి గదిలో పిల్లలంతా ఉత్సాహంతో సందడి చేశారు. కెరమెరి మండలం పట్నాపూర్ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో శనివారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ చేసిన బోధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.**

**ఉద్యమ కెరటం, కెరమెరి:** గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న వసతులు, నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జాదవ్ అంబాజీ పట్నాపూర్ పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, బోధనా పద్ధతులు, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటిస్తూ పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యసన స్థాయిలను పరిశీలించారు.

### డీడీ కాస్తా.. 'మాస్టర్‌జీ'!

తనిఖీతో సరిపెట్టకుండా అంబాజీ స్వయంగా బోర్డు పట్టారు. పిల్లల ముందు నిలబడి పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. మధ్య మధ్యలో ప్రశ్నలు వేస్తూ పిల్లలు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారో తెలుసుకున్నారు. విద్యార్థులు పోటీపడి సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. నిత్యం అధికారిగా కనిపించే డీడీ తమ తరగతి గదిలో మాస్టారుగా మారి పాఠాలు చెప్పడంతో చిన్నారుల్లో సరికొత్త ఉత్సాహం కనిపించింది. పిల్లలతో కలిసి మమేకమవుతూ పాఠాలు చెప్పిన అంబాజీ.. చదువంటే భయం కాకుండా ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులకు బలమైన విద్యా పునాది వేస్తే ఉన్నత తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.



### 'వెనుకబడిన వారిని ముందుకు తీసుకురండి'

చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి అదనపు బోధన అందించాలని అంబాజీ సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. వినూత్న బోధనా పద్ధతులను అనుసరిస్తూ పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంచాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు. ఉన్నతాధికారిగా తనిఖీకి వచ్చి కేవలం రికార్డులు పరిశీలించడంతో సరిపెట్టకుండా.. స్వయంగా బోర్డు పట్టి పిల్లలకు పాఠాలు చెప్పిన 'మాస్టర్‌జీ అంబాజీ' తీరు విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది.

# 60 ఏళ్ల తర్వాత.. దీపక్ పూనియాకు కాంస్యం

**నాగోయా, అక్టోబరు 3 :** ఆసియా క్రీడలు 2026లో భారత రెజ్లర్ దీపక్ పూనియా చారిత్రక పతకాన్ని సాధించాడు. పురుషుల 97 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మంగోలియాకు చెందిన ఘన్‌కుయగ్ గన్‌బాతర్‌పై 2-1 తేడాతో విజయం సాధించి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. దీంతో ఈ విభాగంలో భారత్ దాదాపు ఆరు దశాబ్దాల పతక నిరీక్షణకు తెరపడింది. దీపక్, గన్‌బాతర్ మధ్య జరిగిన పోరు హోరాహోరీగా సాగింది. ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా దీపక్ పట్టువిడవకుండా పోరాడాడు. చివరికి 2-1తో విజయం సాధించి కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. పోడియంపై మువ్వన్నెల జెండాతో నిలిచిన దీపక్ భారత అభిమానులను ఆనందంలో ముంచెత్తాడు. గత ఆసియా క్రీడల్లోనూ దీపక్ పూనియా పతకం సాధించాడు. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో 86 కేజీల విభాగంలో రజత పతకాన్ని గెలిచిన అతడు.. ఈసారి 97 కేజీల విభాగంలో కాంస్యంతో మెరిశాడు. విభాగం మారినా ఆసియా క్రీడల్లో వరుసగా రెండోసారి పతకం సాధించడం విశేషం. పురుషుల 97 కేజీల విభాగంలో భారత్‌కు గతంలో 1962లో మారుతి మనే స్వర్ణం, గణపత్ అందల్కర్ రజతం సాధించారు. 1966లో బిష్వంత్ సింగ్ సిల్వర్, భీమ్ సింగ్ కాంస్య పతకాలు గెలిచారు. ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు పతకం దక్కలేదు. ఇప్పుడు దీపక్ పూనియా కాంస్యంతో ఆ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. ఈ పతకంతో ఆసియా క్రీడల్లో భారత పతకాల సంఖ్య 83కు చేరింది. ఇందులో 20 స్వర్ణాలు, 26 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
4 అక్టోబర్ 2026



# నువ్వుంటేనే కిక్ మరెవరితోనూ ఊహించుకోలేను!'

సినిమా నిర్మాణంలో కథతో పాటు అందులో కలిసి పనిచేసే వ్యక్తులు కూడా చాలా ముఖ్యమని కథానాయిక మాళవిక మోహనన్ పేర్కొన్నారు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ అలరిస్తున్న ఈ భామ, ఇటీవల 'సర్దార్ 2' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం విజయ్ సేతుపతికి జోడీగా 'పాకెట్ నోవెల్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా సినిమా మేకింగ్ ప్రయాణం, విజయ్ సేతుపతితో కలిసి పనిచేసిన అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా ఆమె అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాళవిక మోహనన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ.. "కొన్ని సినిమాలు తీస్తున్న సమయంలో అవే ఒక చిన్న ప్రపంచంగా మారిపోతాయి. అలాంటిదే ఈ 'పాకెట్ నోవెల్' చిత్రం. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా ప్రయాణంలో నేను నేర్చుకున్న ముఖ్యమైన విషయం ఏమిటంటే.. కేవలం నటన మాత్రమే కాదు, ఎవరితో కలిసి పనిచేస్తున్నామనేది కూడా అంతే ముఖ్యం. ఓ చిత్ర బృందంతో కలిసి నెలల తరబడి గడుపుతాం. ప్రతిరోజూ ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కష్టసుఖాలను పంచుకుంటాం. అలా తెలియకుండానే ఆ టీమ్ ఒక కుటుంబంలా మారిపోతుంది" అని పేర్కొన్నారు. అలాగే నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసలు కురిపిస్తూ.. "అద్భుతమైన నటుడైన విజయ్ సేతుపతితో కలిసి నటించడం ఓ గొప్ప అనుభవం. ఆయనతో తప్ప ఈ సినిమా ప్రయాణాన్ని మరెవరితోనూ ఊహించుకోలేను" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం మాళవిక చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.



# బన్నీ-అట్లీ సినిమాలో నేను లేను!

## 'రాకా'లో నెగెటివ్ రోల్ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి క్లారిటీ

**హైదరాబాద్, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్--దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ చిత్రంలో తాను నటిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంపై మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నెగెటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో ఐశ్వర్య కనిపించనున్నారంటూ కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా.. అందులో నిజం లేదని ఆమె తేల్చేశారు. తాను ఈ ప్రాజెక్టులో భాగమే కాదని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ ప్రచారం తొలిసారి చూసినప్పుడు ఆశ్చర్యంతోపాటు నవ్వు వచ్చిందని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా 'అసలు ఆ సినిమాలో నేనే లేను.. ఎవరైనా నాకు ఈ ప్రాజెక్టులో అవకాశం ఇప్పిస్తే బాగుంటుంది' అంటూ సరదాగా స్పందించారు. దీంతో ఆమె నెగెటివ్ పాత్రలో నటిస్తున్నారన్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడింది. అట్లీ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కథలో నాలుగు కీలక మహిళా పాత్రలు ఉంటాయనే వార్తలూ వినిపిస్తున్నాయి. ప్రధాన పాత్ర కోసం దీపికా పదుకొణె పేరు బలంగా ప్రచారంలో ఉండగా, ఫెమినా జార్జ్ మరో కీలక పాత్రకు ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. జాన్వీ కపూర్, రష్మిక మందన్న పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ వీటిపై చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. 'పుష్ప' చిత్రాలతో అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా వచ్చిన ఆదరణ, 'జవాన్'తో అట్లీ సాధించిన భారీ విజయం నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే చిత్రానికి 'రాకా' అనే టైటిల్, నలుగురు కథానాయికలు, ఇతర తారాగణం గురించి జరుగుతున్న ప్రచారంలో ఏది అధికారికమో చిత్రబృందం ప్రకటించిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# మాజీ మహిళా మావోయిస్టులకు బాలీవుడ్ చాన్స్!







**రాయ్‌పూర్, అక్టోబర్ 03 (ఉద్యమ కెరటం):** హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు బాలీవుడ్‌లో నటించే అరుదైన అవకాశం లభించింది. ఇటీవల ఓ ఫ్యాషన్ షోలో వారు ప్రదర్శించిన ర్యాంప్ వాక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, చిత్ర పరిశ్రమ దృష్టిని ఆకర్షించడంతో ఈ ఆఫర్ వారిని వరించింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన ఈ తొమ్మిది మంది మహిళలు ఆగస్టులో రాయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర గ్రామోద్యోగ్ శాఖ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో వారు సంప్రదాయ కోసా సిల్క్ వస్త్రాలు ధరించి ఎంతో ఆత్మవిశ్వాసంతో ర్యాంప్ వాక్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో 'బెంగాల్ 1947' చిత్ర దర్శకుడు ఆకాశ్ ఆదిత్య లామా వీరిని గమనించారు. తన తర్వాతి సినిమాలో వీరికి అవకాశం కల్పించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. 1994లో బస్తర్ ప్రాంతంలో జరిగిన ఓ సున్నితమైన వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘకాలం మావోయిజం ప్రభావిత ప్రాంతాల్లో జీవించిన ఈ మహిళల అనుభవాలు చిత్రంలోని పాత్రలకు పూర్తి సహజత్వాన్ని తెస్తాయని చిత్రబృందం భావిస్తోంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో బస్తర్ అడవుల్లోనే ఈ సినిమా షూటింగ్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కాగా, ఎంపికైన వారికి షూటింగ్‌కు ముందు ఆడిషన్లు నిర్వహించి, 10 నుంచి 15 రోజుల పాటు నటనలో ప్రత్యేక వర్క్‌షాప్ కూడా నిర్వహించనున్నారు. ఈ పరిణామంపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. హింసామార్గాన్ని వీడిన వారికి ఇలాంటి అవకాశాలు రావడం వారి పునరావాసానికి, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు అడవుల్లో తుపాకులు పట్టిన చేతులతో ఇప్పుడు కెమెరా ముందుకు రానుండటం విశేషం.

# రచితా రామ్ బుగ్గలు గిల్లిన అభిమాని..

**బెంగళూరు, అక్టోబర్ 3 (ఉద్యమ కెరటం):** కన్నడ స్టార్ హీరోయిన్, 'డింపుల్ క్వీన్' రచితా రామ్‌కు తన పుట్టినరోజు వేడుకల్లో ఓ అభిమాని నుంచి ఊహించని అనుభవం ఎదురైంది. సెల్ఫీ తీసుకున్న ఆనందంలో ఒక యువకుడు ఆమె బుగ్గలు గిల్లగా, రచిత ఏమాత్రం ఆగ్రహం వ్యక్తం చేయకుండా చిరునవ్వుతో స్పందించి అభిమానుల మనసు గెలుచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**